5

# ప్రయాణముల కాలము

## నిర్గమమునుండి యొర్దానును దాటువరకు, క్రీ.పూ. 1491- 1451 (నిర్గమ. 15-40, లేవి., సంఖ్యా., ద్వితీయో.)

### I. ఎర్ర సముద్రమునుండి సీనాయివరకు. (నిర్గమ. 15-18.)

**1. విమోచనా గీతం** (నిర్గమ. 15). – ఎర్ర సముద్రానికి తూర్పు భాగానికి చేరిన ఇశ్రాయేలీయుల ఉద్వేగాలను తేలికగా వర్ణించలేము సరిగదా, వాటిని గ్రహించడం కూడా సులభసాధ్యం కాదు. వినయవంతమైనదైనా విజయవంతమైన ధన్యత వారికి అత్యున్నతమైన అనుభవాన్ని కలిగించియుండవచ్చు. గర్వానికి ఏ చోటూ లేదు. వారి అపాయం ఎంత కష్టతరమయ్యిందో వారి విడుదల అంత సంపూర్ణమయ్యింది మరియు అది సంపూర్ణంగా యెహోవావలననే కలిగినది గనుక విముక్తికి జ్ఞాపక చిహ్నముగా మన వద్దకు వచ్చిన దీర్ఘమైన ఆ గీతంలో ఆయనకే స్తుతి వినిపించబడింది.[1]

**2. రెఫీదీముకు ప్రయాణము.** – విజయ సాధనతో ఇశ్రాయేలీయులు ఎక్కువసేపు నిలిచియుండలేదు. దేశీయ (జాతీయ) నిర్వహణ సీనాయి దగ్గర ముగించబడాలి. అక్కడికి వెళ్లే మార్గంలో కొంత దూరము సముద్రపు తూర్పు తీరమై యుంది; ఉత్తరపువైపున దానిని ఆనుకున్న జిల్లా "షూరు అరణ్యము" అని, దక్షణపు వైపున "సీను అరణ్యమని" ఉన్నాయి. ఈ ప్రయాణపు తొలి భాగంలో మారా జలములను మధురంగా చేయడం, ఏలీములో పన్నెండు ఊటలు, డెభై ఈత చెట్ల వద్ద విడిది దాటిపోయారు. నిర్గమం జరిగి ఒక నెల గడిచిపోయింది. వారు భయంకరమైన సీను అరణ్యంలో ప్రవేశించారు.[2] ఐగుప్తునుండి తెచ్చుకున్న ఆహార ధాన్యం అయిపోనారంభించింది, దాహంతో ఆకలి బాధ జతకూడింది. గత విముక్తి, దేవుని స్థిరమైన వాగ్దానాలను మరచిన జనులు, అరణ్యంలో చనిపోవుటకు తమ్మును తోడుకొని వచ్చినట్టు జనులు మోషేపై కఠినమైన నిందల రాశిని మోపారు. అప్పుడు కనికరంతో కూడిన అద్భుతం, అనుదినము అనుగ్రహింపబడే మన్నా ఆరంభమై వారి ప్రయాణకాలపు నలభై సంవత్సరాలు అనుగ్రహింపబడింది. దానినే ప్రభువైన యేసు పరలోకమునుండి వచ్చిన ఆహారమైయున్నట్టు తనకు రమ్యమైన పోలికగా ఉపయోగించుకున్నారు.

**3. రెఫీదీముయొద్ద విడిది.** – ఇశ్రాయేలీయులు యిప్పుడు చెకుముకి రాయిగానున్న సీను అరణ్య మైదానమును విడిచి, రెఫీదీము లోయలో దిగారు. వారు హోరేబు అను పర్వత శ్రేణిగానున్న ప్రదేశంలోనికి ప్రవేశించుతున్నారు. ఇక్కడ కూడా వారు నీళ్ల కొరకు

యిబ్బంది పడ్డారు. మోషే బండను కొట్టగా నీళ్లు సమృద్ధిగా ప్రవహించాయి. ఇక్కడ అమాలేకీయులు అక్కరలేని భయంకరమైన యుద్ధానికి దిగారు. అహరోనును హూరోను మోషే చేతులు ప్రార్థనయందు పైకి నిలబెట్టియుండగా, ఏర్పరచబడిన మనుష్యులచే యెహోషువ నాయకత్వంలో తరిమి కొట్టబడ్డారు. గొప్ప పోటీలోను, నిర్గమములోను యిత్రోతోనున్న మోషే కుటుంబము అతనితో కలిసికొంటారు. న్యాయతీర్పు విషయంలో న్యాయమైన, విలువైన సలహా యిచ్చి యిత్రో మోషేకు సహాయం చేస్తాడు.

## II. సీనాయి వద్దనున్న సంవత్సరము.

రెఫీదీమునుండి మోషే ఇశ్రాయేలీయులను సీనాయి పర్వతము వద్దకు నడిపిస్తాడు. వారు వెళ్లే లోతైన కనుమల మార్గం భీతి కొల్పేలా ఉంటుంది. అయితే కడకు వెయ్యిన్ని అయిదు వందల అడుగుల ఎత్తులో విశాలమైన నల్లరాయి బలిపీఠాన్ని పోలి పరిశుద్ధ పర్వతము ఎదుట ఎత్తుగానున్న మైదానంలో వారు విడిది దిగారు.[3]

**1. జాతీయ నిబంధన** (నిర్గమ. 19, 20). – అబ్రాహాముతో చేయబడిన నిబంధన పితరుల కాలంలో తరచుగా సరి క్రొత్తదిగా చేయబడింది. ఇటీవల మండుచున్న పొద దగ్గర మోషేకు అది సరి క్రొత్తగా చేయబడినదే, భక్తి శ్రద్ధలతో విస్తరింపజేయబడి జాతీయ నిబంధనగా తీర్చి దిద్దబడింది. అబ్రాహామును పిలిచిందెవరో, పితరులను కాపాడిందెవరో, ఐగుప్తులో ప్రజల మూలుగులను విని బానిసత్వంనుండి వారిని విడిపించిందెవరో; వారి ప్రయాణంలో యిప్పటివరకు వారిని పోషించి నడిపించిందెవరో, ఆయనే వారిని యిప్పుడు తనతో నిబంధన బాంధవ్యంగల వారినిగా చేసికొనడానికి కావాలని అడుగుతున్నాడు. మోషే ద్వారా దేవునిచే ఉద్దేశింపబడిన నిబంధన, ప్రజలచే అంగీకరింపబడి, గ్రంథస్థము చేయబడి, భక్తి పూర్వకమైన బలుల ద్వారాను, రక్త ప్రోక్షణ ద్వారాను స్థిరపరచబడింది. ఈ నిబంధన పది ఆజ్ఞలలోనికి విస్తరించబడి, ఉరుములు, మెరుపులు, భూ కంపము జరుగగా మొదటిగా సీనాయి కొండ శిఖరమునుండి పలుకబడింది. తదుపరి అవి దేవునిచే రాతి పలకలమీద వ్రాయబడ్డాయి. అవి ఈ క్రింద యివ్వబడ్డాయి:

1. నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు.
2. దేని పోలికనైనను నీవు విగ్రహము చేసికొనకూడదు.
3. నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా ఉచ్చరింపకూడదు.
4. పరిశుద్ధముగా ఆచరించుటకు నీవు విశ్రాంతి దినమును జ్ఞాపకముంచుకొనుము.
5. నీ తండ్రిని తల్లిని సన్మానించుము.
6. నరహత్య చేయకూడదు.
7. వ్యభిచరింపకూడదు.
8. దొంగిలింపకూడదు.
9. అబద్ధ సాక్ష్యము పలుకకూడదు.

10. (నీ పొరుగువానిదగు దేనినైనను చూచి) ఆశింపకూడదు.

లికర్జస్ యొక్క చట్టాలకు అయిదు వందల సంవత్సరాలకు ముందుగాను, రోముయొక్క పన్నెండు పలకలకు వెయ్యేండ్ల ముందుగాను, సీనాయినుండి అనుగ్రహింపబడిన గంభీరమైన చట్టమిది. ఈ పది ఆజ్ఞలు యింకా వివరింపబడి, సాంఘీక సంబంధమైన, క్రియా సంబంధమైన చట్టాల్లోనికి విస్తరించబడ్డాయి.

**2. జాతీయ యాజకత్వం.** – పితరుల కాలంలో కుటుంబ యజమానుడు యాజకుడుగా వ్యవహరించాడు. నిర్గమము తరువాత, జాతి యావత్తు పరిశుద్ధమైనదిగా ఎంచబడినప్పుడు, వారిలో తొలి చూలులైతే మరీ ఎక్కువగా ఎంచబడ్డారు (నిర్గమ. 13:2, 11–15). తరువాత తొలి చూలులకు మారుగా లేవీయ గోత్రం ప్రత్యేకించబడింది (సంఖ్యా. 3:5–13). అహరోను కుటుంబికులు యాజక ధర్మం జరిగించడానికి నియమించబడ్డారు. అహరోను తానే, అతని తరువాత జ్యేష్ఠ కుమారుడు ఈ యాజక క్రమములో, యూదా జనాంగంలోని అత్యున్నత స్థానమైన ప్రధాన యాజకుడుగా నియమించబడ్డాడు.

**3. జాతీయ పండుగలు.** – మూడు సంవత్సరపు పండుగలున్నాయి. వారి జాతీయ చరిత్రలో ప్రాముఖ్యమైన సంఘటనలకు అవి జ్ఞాపకార్థ సూచనలు ఒకదానివెంట మరి యొకటి వచ్చు కోత కాలపు దశలననుసరించి ఆ పండుగ ఉత్సవ కాలాలు నియమింపబడ్డాయి.

**ఎ. పస్కా, లేక పులియని రొట్టెల పండుగ**, అబీబు నెల 14–21ల మధ్య (మన ఏప్రిల్ ఆరంభంలో) వచ్చేది నిర్గమము యొక్క రాత్రి స్థాపింపబడి, బానిసత్వంనుండి విడిపింపబడిన దానికి జ్ఞాపకార్థంగా జరుపబడుతుంది, కోత కాలపు ఆరంభముగా కూడా అది జరుపబడుతుంది. ఇందులో ప్రధానమైనది పస్కా గొర్రెపిల్లను పులియని రొట్టెలతోను చేదు కూరలతోను తినడం, పండిన ధాన్యపు పనను పంటను దయచేసిన దేవునికి కృతజ్ఞత సూచనగా అల్లాడించడం.

**బి. వారముల పండుగ లేక పెంతెకొస్తు.** – ఇది పస్కా పండుగ తరువాత ఏభై దినాలకు వస్తుంది. ధాన్యపు కోతకు ముగింపుగా ఈ పండుగ జరుపబడుతుంది. పస్కా పండుగకు ఏభై దినాలకు ధర్మశాస్త్రమియ్యబడినందున, వెనుక వచ్చిన యూదులు ధర్మశాస్త్రం యివ్వబడిన దానికి జ్ఞాపకార్థంగా దీనినాచరించేవారు. కాల్చబడిన (రొట్టె ముక్కలను) అప్పముల రూపములో ప్రథమ ఫలముల నర్పించడం మత సంబంధమైన ముఖ్య ఆచరణయైయుంటుంది.

**సి. పర్ణశాలల పండుగ, లేక ఫల సంగ్రహముల పండుగ.** – ఇది ఏడవ నెల పదిహేనవ దినమునుండి, ఇరవై రెండవ దినంవరకు ఆచరింపబడుతుంది. అది పంట – ఇల్లు వంటిది. ఫల సంగ్రహములను ఆచరించడం. అది యూదులు కృతజ్ఞతలు చెల్లించడం. నలభై సంవత్సరాలు వారు గుడారాలలో నివసించిన దానికి జ్ఞాపకార్థంగా, ఒక వారం రోజుల పాటు వారు కొమ్మలతో నిర్మించబడిన తాత్కాలికపు పాకలో ఉంటారు.

**4. జాతీయ గుడారం.** – సీనాయిలో ఉన్న సంవత్సరం గుడారము కట్టబడింది. అది మోసికొని వెళ్లగల దేవాలయం, పదిహేనుకు నలభైయయిదు అడుగులు. "పరిశుద్ధ

స్థలము" పదిహేనుకు ముప్పై అడుగులు, సముఖపు రొట్టెల బల్ల, ఏడు ప్రమిదలుండే దీప స్తంభము, అంతా బంగారంతో ఉంటాయి. "అతి పరిశుద్ధ స్థలం," పదిహేను అడుగుల చచ్చౌకమైనది. అందులో సామాగ్రి సువర్ణ ధూపార్తియు, అంతటను బంగారు రేకులతో తాపబడిన నిబంధన మందసముండెను. ఆ మందసంలో మన్నాగల బంగారు పాత్రయు, చిగురించిన అహరోను చేతికర్రయు, నిబంధన పలకలును ఉండెను. అతి పరిశుద్ధ స్థలములోనికి ఎవడూ వెళ్లకూడదు. అయితే ప్రధానయాజకుడు ఒక్కడే సంవత్సరమునకు ఒక్కసారి ప్రజల పాపముల కొరకు సంవత్సరపు ప్రాయశ్చిత్తము చేయు దినమున (రక్తముతో) అందులో ప్రవేశిస్తాడు. వెలుపట ప్రాంగణములో, దహనబలి నర్పించు బలిపీఠము, గంగాళము పెట్టబడి ఉంటాయి. అరణ్య ప్రయాణములలో ప్రత్యక్ష గుడారాన్ని మోసికొని వెళ్లుతూ ఉండేవారు. అటు తరువాత, సొలొమోను దేవాలయం కట్టబడేవరకు రమారమి నాల్గువందల సంవత్సరాలు షిలోహులో ఉంచబడి జాతీయ ఆరాధనకు స్థానంగా ఉండిపోయింది.

**5. జాతీయ బలులు.** – హెబ్రీయుల ఆరాధనకు ప్రధానమైన లక్షణం బలుల నర్పించడం. అవి జంతు బలులు కావచ్చు లేక ఫలముల అర్పణలు కావచ్చు. జంతు బలులలో మూడు తరగతులున్నాయి.

ఎ. దహన బలులు. – ఇవి అనుదినం ఉదయ, సాయంకాలాలు అర్పించబడుతూ ఉంటాయి; దేవునికి పూర్ణమైన సమర్పణ అనడానికి గుర్తుగా అవి సంపూర్తిగా దహింపబడతాయి.

బి. సమాధాన బలులు (అర్పణలు). – ఈ బలి అర్పించేవాడు తన స్నేహితులను విందుకు ఆహ్వానించుకొనేలా కొన్ని భాగాలు ఎత్తిపెట్టబడడం అనేది ఈ బలుల స్వభావమై యుంటుంది. దేవునితో సహవాసము, సంబంధము కలిగియుండడం అనేవాటిని వ్యక్త పరచడానికి ఉద్దేశింపబడతాయి, కొన్నిసార్లు యివి అధిక సంఖ్యలో అర్పించబడతాయి.

సి. పాప పరిహారార్థబలి. – ఇవి వ్యక్తిగతమైనవి కావచ్చు లేక జాతీయమైనవి కావచ్చు. అది ఏ సందర్భంలోనైనా, ఈ బలి ఒక బలి పశువునే కలిగియుంటుంది. ఒక భాగము బలిపీఠం మీద దహించబడుతుంది; ఒక భాగము యాజకులు తినవలసియుంటుంది, అయితే అది ఏ పాత్రలో వండబడుతుందో ఆ పాత్ర అటు పిమ్మట, లోహముదైతే శుభ్రముగా కడగాలి మట్టిదైతే పగల గొట్టాలి. దాని అంతరింద్రియములు వగైరాలను శిబిరము వెలుపట దహింపబడాలి. పాపము యొక్క అపవిత్రతను గూర్చిన పాఠం మనస్సులో ముద్రించడానికి గాను పాప పరిహారార్థ బలియొక్క ఆచరణ ఉద్దేశింపబడినట్టుంది.

**6. జాతీయ భ్రష్టత్వము.** – సీనాయి కొండ దిగువ భాగంలోనే జాతీయ నిబంధన అతిక్రమించబడింది. కొండమీదనున్న మోషే వారి మధ్య లేకపోవడంతో తమకు ముందు నడవడానికి దేవతలు కావాలని జనులు అడిగారు. అహరోను వారికి లోబడ్డాడు. ఐగుప్తీయులు కొలిచే దూడను అనుసరించి, ఇశ్రాయేలీయులు విగ్రహ సంబంధమైన పండుగ జరుపుకున్నారు. అది రెండవ ఆజ్ఞకు నేరైన అతిక్రమము. మోషే రాతి పలకలతో రానే వచ్చాడు. ఆ నిబంధనను వారు భంగము చేయగా అది వ్రాయబడిన పలకలను అతడు పగులగొట్టాడు. అతని విజ్ఞాపన ద్వారా జనులు పునరుద్ధరింపబడ్డారు, అయినా

ఆ నేరానికి శిక్షగా మూడు వేలమంది కూలేవరకు పునరుద్ధరణ జరుగలేదు. అటు పిమ్మట నిబంధన సరి క్రొత్తదిగా చేయబడింది, క్రొత్త పలకలు సిద్ధపరచబడ్డాయి.

## III. సీనాయినుండి కాదేషువరకు.

**1. జనాభా లెక్కలు.** – సీనాయిలో విడిది ముగించక ముందు, గోత్రముల జనాభా లెక్కలు తీయబడ్డాయి. ముప్ఫై ఎనిమిది సంవత్సరాల తరువాత, ప్రయాణాలు ముగియక మునుపు రెండవసారి జనాభా లెక్కలు తీయబడ్డాయి. రెండు సార్లు తీయబడిన ఈ జనాభా లెక్కలవలన సంఖ్యాకాండానికి ఆ పేరు వచ్చింది.

**2. కాదేషుకు సాగి పోవడం.** – సీనాయినుండి, నిర్గమము తరువాత ఒక సంవత్సరానికి, కనానుకు దక్షిణపు కొసనున్న కాదేషుకు ఇశ్రాయేలీయులు చేరుకుంటారు. మార్గం అలసట కలిగించే ఎడారిలో ఉంది. టబేరా వద్ద, ఎక్కువగా సణిగి, అగ్నిచే దహించబడ్డారు. ప్రయాణం తిరిగి కొనసాగించకముందు, తమ్మును వెంబడించిన మిశ్రిత జనముచే ప్రేరేపించబడి, ఇశ్రాయేలీయులు మన్నాను అసహ్యించుకున్నారు, ఐగుప్తు భోజనాన్ని కోరారు. పూరేడు పిట్టలు అపరిమితంగా పంపబడ్డాయి; దానితో పాటు తెగులు కూడా వచ్చింది, జన సమూహాలు నశించిపోయారు. టబేరా విడిది కిబ్రోతు హత్తావా అని పిలువబడింది (మృగవాంఛ సమాధులు). ఆ ప్రయాణంలో బాధాకరమైన మరొక సంఘటన మిర్యాము అహరోనుల ద్రోహం. మిర్యాము కుష్టుతో మొత్తబడి మోషే విజ్ఞాపన చేయగా స్వస్థపరచబడింది.

**3. విశ్వాసము విడిపోవడం.** – కాదేషునుండి వాగ్దాన భూమిని వేగు చూడడానికి పన్నిద్దరు మనుష్యులు పంపబడ్డారు. ఏకాభిప్రాయంగా వారందరు ఆ దేశాన్ని పొగిడారు, దాని సారవంతమైన స్థితికి రుజువుగా కొన్ని పండ్లను కూడా తెచ్చారు. అయితే యెహోషువ, కాలేబులు తప్ప మిగిలిన వారందరు దాన్ని జయించుతామనే నిరీక్షణ లేదని చెప్పారు. దానితో వారి జాతీయ విశ్వాసము ఒక్కసారి కూలిపోయింది. మరొక నాయకుని ఎన్నుకొని తిరిగి ఐగుప్తుకు వెళ్లదామని వారు ప్రతిపాదించారు. వారిని ధైర్యపరచడానికి పూనుకున్న యెహోషువ, కాలేబులు రాళ్లతో కొట్టబడకుండ కొద్దిలో తప్పించుకున్నారు. తరచుగా వారి విశ్వాసము బలహీనమై చలించుతూ ఉండినా; వాగ్దాన భూమినుండి వారు యింతకు ముందు వెనుకకు తిరిగినవారు కారు; వారి ముఖాలు బానిస గృహంవైపు నిలిపినవారు కారు. అది విశ్వాసము యొక్క శిఖరాగ్రం (హెబ్రీ. 3:19). అవిశ్వాసులైన ఆ తరమువారు ముప్ఫై ఎనిమిది సంవత్సరాలపాటు తిరుగుతూ ఉండవలసిందిగా విధించబడ్డారు; ఒకని వెంట మరొకని ఎముకలు అరణ్యంలో చీకి పోయేవరకు. కాలేబు, యెహోషువలు మాత్రమే కనానులో ప్రవేశించేలా బ్రతికారు. ఈ ముప్ఫై ఎనిమిది సంవత్సరాలు దాదాపుగా ఖాళీయే. సబ్బాతును అతిక్రమించిన వానికి విధింపబడిన శిక్ష, కోరాహు, దాతాము, అబిరాముల తిరుగుబాటు, అహరోను యొక్క ప్రధాన యాజకత్వపు అధికారము చిగురించిన అతని చేతి కర్రచే స్థిరపరచబడడం, అనేవి ఈ కాలంలోని సంభవాలు. దాని ముగింపులో కనానుకు వెళ్లడానికి తిరిగి ఇశ్రాయేలీయులు కాదేషుకు చేరుకుంటారు.

## IV. కాదేషునుండి యొర్దాను వద్దకు.

రెండవసారి కాదేషులో ఉన్నప్పుడు, బండను రెండుమార్లు కొట్టి మోషే అహరోనులు పాపం చేసినందున వాగ్దాన భూమిలోనికి వెళ్ల అనుమతి పొందక పోయారు. అక్కడ మిర్యాము మృతినొందుతుంది. ఏశావు సంతతివారైన ఎదోమీయులు వారి భూ భాగంలోనుండి వెళ్లడానికి అనుమతించనందున, ఇశ్రాయేలీయులు తిరిగి వెళ్లి, ఎఱ్ఱ సముద్రము యొక్క దక్షణపు కొనను తాకుతారు. మార్గంలో అహరోను చనిపోయి, హోరు పర్వతమునొద్ద పాతిపెట్టబడతాడు. క్రొత్తగా ఉత్పన్నమైన అవిశ్వాసమువలన తాపకరమైన సర్పపు తెగులు ఆరంభమయ్యింది. క్రీస్తు కల్వరిలో ఎత్తబడిన దానికి పోలికగా, వారు స్వస్థతనొందడానికి మోషే యిత్తడి సర్పాన్ని వారి మధ్య నిలుపుతాడు. యొర్దానుకు తూర్పుననున్న అమోరీయుల బలిష్టులైన ఓగు, సీహోనను యిద్దరు రాజులను జయిస్తారు. రూబేను, గాదు, మనష్షే యొక్క అర్ధ గోత్రము ఆ భూ భాగంలో స్థిరపడతారు. ఇశ్రాయేలీయుల విజయ యాత్రల విషయమై భీతిల్లిన మోయాబు రాజు వారిని శపించునట్లు పేరుగాంచిన దీర్ఘ దర్శియగు బిలాముకు లంచమిస్తాడు. తన శాపములు ప్రతి సమయములో అతని పెదవుల మీద దీవెనలుగానే ఉచ్చరింపబడ్డాయి. ప్రత్యక్షంగా అతడు దేనిని చేయజాలక పోయెనో, పరోక్షంగా చేయగలిగాడు. మోయాబు స్త్రీలతో ఇశ్రాయేలీయులు పాపము చేసేలా కల్పించాడు. దానికి శిక్షగా పంపబడిన తెగులు వలన వేలకొలది మంది దేవుని ప్రజలు సంహరింపబడ్డారు. ఫల శూన్యమయిన ఎడారి యొక్క అపాయములతో పాటు, ఒక వైపు భయంకరమైన శత్రువులు మరోవైపు వారి సొంత విశ్వాసము అనే వాటిచేత యొర్దానుకు ప్రక్కనే తూర్పు భాగానా ఇశ్రాయేలీయులు మజిలీ వేశారు. ద్వితీయోపదేశకాండంలో ఎక్కువ భాగంతో కూడిన సందేశాన్ని వీడ్కోలు ప్రసంగంగా మోషే ప్రసంగించాడు. మృత సముద్రానికి తూర్పు దిశగా పిస్గా కొండయొక్క శిఖరాగ్రమునుండి వాగ్దాన భూమియొక్క దర్శనం అతనికివ్వబడింది. అక్కడ అతడు మృతినొంది తెలియబడని సమాధిలో పాతిపెట్టబడతాడు. అతని పని జరిగించబడింది. అతడు తన ప్రజలను విమోచించాడు, బానిస వంశంనుండి క్రమపరచబడిన దేశంగా రూపొందించాడు, వాగ్దాన భూమియొక్క గుమ్మముల దగ్గరకు చేర్చాడు. తన పనిని తన జీవితాన్ని కలిపి అతడు క్రింద పెట్టాడు.

---

సూచనలు

[1]మోషే కీర్తనకును, పెంటూరు యొక్క పద్యానికిని మధ్యగల తారతమ్యానికి గిబ్బన్ యొక్క "మోషే యుగము" పేజీ 62ను సంప్రదించు. [2]ఈ అరణ్యాలలో ప్రయాణం యొక్క వివరాల కొరకు, గెయికీ యొక్క "బైబిలుతో గంటలు," Vol. II., పేజీలు 200, 201, 210, 211 చూడు. [3]See *"Hours With the Bible,"* Vol. II., pp. 251-253, 261-264.

## యాకోబు యొక్క 12 మంది కుమారులు

లేయా కుమారులు

1. రూబేను
2. షిమ్యోను
3. లేవీ
4. యూదా
5. ఇశ్శాఖారు
6. జెబూలూను

(లేయా దాసియైన) జిల్పా కుమారులు

7. గాదు
8. ఆషేరు

(రాహేలు దాసియైన) బిల్హా కుమారులు

9. దాను
10. నఫ్తాలి

రాహేలు కుమారులు

11. యోసేపు
12. బెన్యామీను

## ఇశ్రాయేలు 12 గోత్రములు

1. రూబేను
2. షిమ్యోను
   (భూమి విభాగింపబడినప్పుడు - ఆక్రమణ తరువాత లేవీయులకు భాగమియ్యబడలేదు ఎందుకంటే వారు యాజకులకు సహాయకులు.)
3. యూదా
4. ఇశ్శాఖారు
5. జెబూలూను
6. గాదు
7. ఆషేరు
8. దాను
9. నఫ్తాలి
10. ఎఫ్రాయిము*
11. మనష్షే*
    (*ఇద్దరు గోత్రకర్తలే ఎందుకంటే వారిద్దరు యోసేపు కుమారులు. వారు యాకోబుచే దత్తు తీసికోబడ్డారు.)
12. బెన్యామీను